క్లుప్తంగా

విచారణ..



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

హిరమండలం: మండలంలోని సుభలాయి ఆర్అండ్ఆర్ కాలనీ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అధికారులు గురువారం విచారణ చేపట్టారు. పంచాయతీ నిధుల పక్కదారి పట్టినట్లు అధికారులకు కె.అప్పలనాయుడు ఫిర్యాదు చేశారు. డీఎల్‌పీఓ ఐ.వి.రమణ, డిప్యూటీ ఎంపీడీఓ గోవిందరావు, ఈఓ భాస్కరరావులు సుభలాయిలో విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుచేసిన వారి నుంచి వివరాలను అడిగి నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని డీఎల్‌పీఓ తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

హిరమండలం: లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కరరావు అన్నారు. గురువారం ఎల్.ఎన్.పేట పీహెచ్‌సీ పరిధిలో లింగ నిర్ధారణకు వ్యతిరేకంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. హెచ్‌సీ భాస్కరరావు మాట్లాడుతూ.. అనారోగ్య, అత్యవసర పరిస్థితుల్లో తప్పితే స్కానింగ్ చేయకూడదన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. వైద్యాధికారి హర్ష, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వాహనాన్ని పరిశీలిస్తున్న దినేష్‌కుమార్

హిరమండలం: గ్రామాల్లో 104 వాహనం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని, వాహనాల నిర్వహణ చూస్తున్న భవ్య ఏజెన్సీ డివిజనల్ అధికారి దినేష్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని 104 వాహనాన్ని తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమయ్యారు. వాహనం ద్వారా అందించిన సేవలు గురించి ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం అంబావల్లి గ్రామంలో 104 వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పైలెట్ అప్పారావు, సిబ్బంది సీతారామరాజు, స్వర్ణకుమారి, జ్యోతి పాల్గొన్నారు.

226 మందికి వైద్య పరీక్షలు

కొత్తూరు: మండలంలోని నివగాం గ్రామంలో గురువారం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 226 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.


ఈ–క్రాప్ పరిశీలన



మర్రివలసలో ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీ మధు

జలుమూరు: ఈ–క్రాప్ నమోదు వేగవంతం చేయాలని నరసన్నపేట వ్యవసాయశాఖ సహాయక సంచాలకులు ఎల్.వి.మధు అన్నారు. గురువారం మర్రివలస, నగిరికటకం రెవెన్యూ పరిధిలో ఈ–క్రాప్ నమోదును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ–క్రాప్ వల్ల రైతులకు బీమా, ధాన్యం అమ్మకాలు, పంట నష్టం, తదితర ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ–క్రాప్ నమోదు చేయకపోతే ఆయా సచివాలయాల వీఏఏలే బాధ్యత వహించాలన్నారు. ఏఓ కె.రవి కుమార్, ఏఈఓ కె.సురేష్, వీఏఏలు శివకుమార్, భారతి, రైతులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



విద్యార్థులతో సీపీఆర్ చేయిస్తున్న డాక్టర్ ఉమాగౌరి

పాతపట్నం: అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తి ఊపిరి తీసుకోలేకపోయినా, పల్స్ అందకపోయినా సీపీఆర్ ప్రక్రియ చేయాలని హోమియో వైద్యురాలు ఎస్.ఉమాగౌరి సూచించారు. మండలంలోని తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీపీఆర్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ సీపీఆర్‌ని నిర్వహించినప్పుడు రక్తం సరఫరా బాగా జరుగుతుందన్నారు. సీపీఆర్ చేస్తూ ఉండగానే అంబులెన్స్‌కి ఫోన్ చేయాలన్నారు. విద్యార్థులతో సీపీఆర్ చేయించారు. హెచ్ఎం సీహెచ్ విశ్వనాథం, ఉపాధ్యాయులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెకు చేరని వెలుగు

- గ్రామీణ ప్రాంత మహిళలకు అందని స్త్రీశక్తి పథకం సేవలు
- బస్సు సౌకర్యం లేక ప్రజల అవస్థలు



సరుబుజ్జిలి: ప్రతీ పల్లె నుంచి పట్టణాలకు వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉండేందుకు ఏర్పాటు చేసిన పల్లె వెలుగు బస్సులు ప్రస్తుతం కానరావడం లేదు. గతంలో చిన్న, చిన్న పల్లెలను కలిపి ప్రధాన పట్టణాలకు బస్సు సౌకర్యం ఉండడం వలన ప్రజల అవసరాలు గట్టెక్కేవి. మారుతున్న కాలమానం ప్రకారం పల్లె వెలుగు బస్సులు చాలా గ్రామాలకు వెళ్లని పరిస్థితులు ఉన్నాయి. ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన స్త్రీశక్తి పథకం వలన బస్సులు లేక, ఉన్న ఒకటో, రెండో బస్సులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఈ పల్లెలకు బస్సులు దూరం...

ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, పొందూరు మండలాల పరిధిలోని దాదాపు 50 శాతం గ్రామాలకు గతంలో పల్లె వెలుగు బస్సులు నడిచేవి. దీనివలన ప్రజలు ప్రయాణాలకు సాఫీగా చేసేందుకు చాలా అనుకూలంగా ఉండేది. ప్రధాన రహదారికి సుదూరంగా ఉన్న సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేట, పెద్దసవలాపురం, పురుషోత్తపురం, అలమాజీపేట, ఇస్కలపాలెం, సుబ్బపేట, పెదమాలపేట, పాలవలస, ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ, పాతూరు, కొత్తవలస, చీమలవలస, బూర్జ మండలం గుత్తావల్లి, లాభాం, లంకాం, ఖండ్యాం, పొందూరు మండలం పిల్లవలస, దల్లవలస గ్రామాలకు బస్సు సౌకర్యం పూర్తిగా లేదు.

పరిశీలన చేస్తాం

బస్సులు నిలిచిపోయిన గ్రామాల వివరాలు మరలా పరిశీలన చేస్తాం. అక్కడ ప్రయాణికుల రద్దీని కూడా గమనించి సత్వర చర్యలు తీసుకుంటాం.
– పి.వర్మ, ఆర్టీసీ డిపో మేనేజర్, శ్రీకాకుళం

ఇబ్బంది పడుతున్నాం



మా గ్రామానికి గతంలో బస్సులు నడిచేవి. కొద్దిరోజుల తరువాత బస్సులు నిలిపేశారు. దీనివలన విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. దీనివలన సుదూర ప్రాంతాల నుంచి ప్రధాన రహదారులకు నడచి వెళుతున్నాం.
– పైడి మోహన్‌రావు, మతలబుపేట, సరుబుజ్జిలి మండలం

ప్రయాణికులు ఉన్నా బస్సులు లేవు



బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఉన్నా ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపేందుకు వెనుకంజ వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తెచ్చిన స్త్రీశక్తి పథకం వలన బస్సులు రద్దీగా మారాయి. గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు రావడం లేదు.
– కరణం శ్రీనివాసరావు, పాలవలస, సరుబుజ్జిలి మండలం

రాష్ట్రంలో అప్రజాస్వామ్యం



- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ రెడ్డి శాంతి

హిరమండలం: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం గొంతునొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పలాసలో కల్తీ మద్యంపై ఆందోళనలు జరిపారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు పెట్టడం దారుణమన్నారు. వ్యవస్థలను అడ్డం పెట్టుకొని వైఎస్సార్‌సీపీని దెబ్బతీయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో వేణుగోపాలరెడ్డి అనే కార్యకర్తను జైలుకు పంపడం దారుణచర్య అన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇస్తున్న ఫిర్యాదులను పోలీసులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వాలు తాత్కాలికమని.. వ్యవస్థలు శాశ్వతం అన్న విషయాన్ని పోలీస్ శాఖ మరిచిపోతోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న కృష్ణచైతన్య

సారవకోట: మండలంలోని బైదాలాపురం పంచాయతీకి చెందిన పలువురు యువకులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ నాయకుడు, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాన్ని బుడితిలో నిర్వహించారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, పార్టీ ప్రచార కార్యదర్శి నిక్కు రాజశేఖర్, జాడ కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన



పాతపట్నం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ రమణ

పాతపట్నం: గ్రామాలు పరిశుభ్రత వాతావరణంలో ఉండాలంటే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ) వినియోగించుకోవాలని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అన్నారు. స్థానిక ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలో మెళియాపుట్టి రోడ్డులో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి కేంద్రాన్ని తరలించాలన్నారు. వీటిని ఎరువులుగా తయారుచేసి రైతులకు అందించాలన్నారు. ఈఓ రామచంద్రరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: మధ్యాహ్న భోజన పథకంలో మెనూను పాటించాలని ఎంఈఓ రాంబాబు ఆదేశించారు. గురువారం కేజీబీవీతోపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధనతో పాటు నాణ్యమైన ఆహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూను సక్రమంగా అమలుచేయాలని ఆదేశించారు. కేజీబీవీ పాఠశాలలో విద్యాబోధన, అందుతున్న వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్యేకాధికారితోపాటు సీఆర్టీలకు సూచించారు.

వరికి దోమపోటు



కోదడ్డపనస సమీపంలో దోమ ఆశించిన వరి పంట

- నివారణకు పెరుగుతున్న ఆర్థిక భారం
- పలుచోట్ల పూర్తిగా పాడైన పంట
- ఆందోళనలో రైతులు

సారవకోట: ప్రస్తుతం వరి పంటకు దోమ ఆశించింది. దోమపోటు నివారణకు అధిక మొత్తం వెచ్చించి మందులు కొనుగోలు చేసి పిచికారీ చేయాల్సి వస్తోంది. మండలంలోని కిన్నెరవాడ, కోదడ్డపనస, బద్రి తదితర గ్రామాల్లో సుడి దోమ అధికంగా వ్యాపించి పంటను నష్టం కలిగిస్తోంది. దోమల నివారణకు ప్రైవేట్ వర్తకుల నుంచి అధిక ధరలకు నివారణ మందులు కొనుగోలు చేసి వాటికి పిచికారీ చేస్తున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో దోమ ఆశించిందని పలువురు రైతులు తెలిపారు. మండలంలో ఈ ఏడాది సుమారు 1,600 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. దీంట్లో 2 శాతం వరకు దోమ ఆశించింది. కొన్నిచోట్ల దోమ ఆశించి తగ్గుముఖం పట్టింది. మరికొన్ని చోట్ల దోమ పోటు ఉండటంతో పంటకు నష్టం వాటిల్లుతోంది.

పెట్టుబడి పెరిగింది



వరి పంటకు దోమ ఆశించింది. దీని నివారణకు ఎప్పటికప్పుడు పురుగు మందులు కొనుగోలు చేసి పిచికారీ చేస్తున్నాం. దీంతో పెట్టుబడి పెరగపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
– బోర త్రినాథ్, రైతు, కోదడ్డపనస, సారవకోట మండలం

కాలి బాటలు తీసుకోవాలి

వరిలో కాలి బాటలు తీసుకోవడం వలన సూర్యరశ్మి పూర్తిస్థాయిలో అందుతోంది. దీంతో దోమ ఆశించే అవకాశం ఉండదు. దోమ ఆశించిన పొలంలో నీటిని పూర్తిగా విడిచిపెట్టాలి. ఫెమోట్రిజన్ ఒక ఎంఎల్‌ను 750 ఎంఎల్ నీమ్ ద్రావణంలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
– కేసీహెచ్ వెంకటరావు, వ్యవసాయాధికారి, సారవకోట

కల్తీ మద్యంపై సీబీఐ విచారణ చేపట్టాలి



- వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: రాష్ట్రంలో కల్తీ మద్యం వ్యాపారం వ్యవస్థీకృత నేరంగా మారిందని, దీనిపై సీబీఐ విచారణ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం ఆమదాలవలసలోని స్వగృహంలో విలేకర్లతో మాట్లాడారు. కల్తీ మద్యం నెట్‌వర్క్ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిందన్నారు. కల్తీ మద్యం ఉత్పత్తి, పంపిణీలో కొంతమంది కూటమి నాయకుల ప్రమేయం ఉందని ఆరోపించారు. తూర్పు రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు ఆరు కేంద్రాలుగా (ముఠాలు) ఏర్పడి బార్‌లు, బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌ల్లో నకిలీ మద్యం విక్రయిస్తున్నారన్నారు. తంబళ్లపల్లికి చెందిన టీడీపీ నాయకుడు జైచంద్రారెడ్డి, సురేంద్ర నాయుడు, జనార్దన్ వంటి వ్యక్తులు ఈ వ్యవస్థ వెనుక ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని అవినీతి, కల్తీ మద్యం కుంభకోణాల అడ్డాగా మార్చిన సీఎం చంద్రబాబు.. అంతర్జాతీయ స్థాయి అవినీతి నేతగా గుర్తింపు పొందారని విమర్శించారు. టీడీపీ అనుకూల మీడియా వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తోందని, ప్రజలు అన్ని వాస్తవాలను గ్రహిస్తున్నారన్నారు.

పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీల ఏర్పాటు



బొడ్డేపల్లిలో పార్టీ కార్యకర్తలతో నాగభూషణరావు

పొందూరు: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నామని పార్టీ రాష్ట్ర సాంస్కృతిక వింగ్ కార్యదర్శి పైడి నాగభూషణరావు అన్నారు. గురువారం మండలంలోని బొడ్డేపల్లి, మొదలవలస గ్రామాల్లో పర్యటించి గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీలు ఏర్పాటుకు నాయకులను సంసిద్ధం చేశామని చెప్పారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని కార్యకర్తలంతా ముక్తకంఠంతో చెప్పారన్నారు. సర్పంచ్ బొడ్డేపల్లి రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కవిటిలో కృష్ణదాస్ పర్యటన

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం కవిటి మండలం లండారిపుట్టుగ పంచాయతీ కొత్తపుట్టుగ గ్రామంలో పర్యటించనున్నారు. ఈ మేరకు పోలాకి మండలం మబుగాం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ గ్రామంలో నిర్వహించనున్న రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రజలకు వివరిస్తారు. సాయంత్రం సోంపేట మండలంలో పర్యటిస్తారు.

పరామర్శ..



చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: స్థానిక భవానీపురంలో నందెన్న నిమజ్జనం సందర్భంగా పురాతన భవన పోర్టుకో కూలి గాయపడిన వారిని పోలాకి జెడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య గురువారం పరామర్శించారు. వారు చికిత్స పొందుతున్న ఆస్పత్రులకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గాయపడిన వారి కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని, ఉచితంగా వైద్యం అందించాలన్నారు. బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, ఎంపీటీసీ నేతింటి రాజేశ్వరరావు, వార్డు సభ్యులు బీఎల్ శర్మ, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బుద్దల రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాలలను కాపాడుకోవాలి



సరుబుజ్జిలి: కొండవలసలో మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: సీఎం చంద్రబాబు తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలకు అడ్డుకట్ట వేయాలని, ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని చిగురువలస, కొండవలస, పాలవలస గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన నాటినుంచే మెడికల్ కళాశాలలను నిలిపేయాలని చంద్రబాబు కుట్రలు పన్నారన్నారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ లావేటి అనిల్‌కుమార్, అత్తులూరి రవికాంత్, మూడడ్ల రమణ, ఇల్లాకుల సూర్యప్రకాష్, బద్రి రామారావు, సర్పంచ్‌లు లావేటి విశ్వేశ్వరరావు, గజ్జన మోహన్‌రావు, వందాన కృష్ణ, గురువులునాయుడు పాల్గొన్నారు.

కూటమి కుతంత్రాలను అడ్డుకోవాలి



పార్టీ అనుబంధ విభాగాల కమిటీ సభ్యులను అభినందిస్తున్న కృష్ణచైతన్య

- పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య

సారవకోట: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడంలో ఉన్న కూటమి కుతంత్రాలను అడ్డుకోవాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. మండలంలోని బుడితి గ్రామంలో డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్ ఆధ్వర్యంలో గురువారం రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ.. గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇటీవల పార్టీ అనుబంధ విభాగాల్లో నియమితులైన వారిని ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బగ్గు రామకృష్ణ, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, కొండాల బాబూరావు, కోరుకొండ శంకరబాబు, ఇసై షణ్ముఖరావు, సాధు సతీష్, పార్టీ నాయకులు నిక్కు రాజశేఖర్, యాళ్ల శ్యామసుందరరావు, సాధు సుజాత, కాళ్ల సింహాచలం, రావాడ శ్రీనివాసరావు, బొంగు కొండయ్య, మందముఖలింగం, కత్తిరి అప్పలనాయుడు, తాడేల రామదాస్, హటకేశ్వరరావు, తదితరులున్నారు.

సాక్షిపై అక్రమంగా కేసులు..

కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను సాక్షి పత్రిక, టీవీ చానల్ ప్రచారం చేస్తున్నాయనే అక్కసుతో అక్రమ కేసులు పెట్టి భయాందోళనకు గురిచేస్తున్నారన్నాని కృష్ణచైతన్య అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియాకు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ఆ స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తుందని దుయ్యబట్టారు.

మలుపులు ప్రమాదాలకు పిలుపులు!



మాకవరం రోడ్డులో రాయలు కూడలి వద్ద ప్రమాదకర మలుపు



వసప -మెట్టూరు రోడ్డులో వెంకటాపురం కూడలి వద్ద ఉన్న మలుపు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కొత్తూరు: మండలంలోని పలు ప్రధాన రహదారుల్లో గల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో నిత్యం రద్దీగా ఉండే అలికాం-బత్తిలి, పాలకొండ-హడ్డుబంగి, నివగాం-గులుమూరు, వసప-మెట్టూరు, గురండి, మాతల-రుగడ రహదారులతోపాటు పలుచోట్ల ప్రమాదకరమైన మలుపులున్నాయి. రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పొదలు ఉన్నందున వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కానరావడం లేదు. కనీసం స్పీడు బ్రేకర్లు కూడా లేని పరిస్థితి.

అలికాం–బత్తిలి రోడ్డులో..

మండలంలోని పారాపురం సమీపంలో అలికాం–బత్తిలి రోడ్డులో గల భారీ మలుపు వద్ద ఈ నెల 15 తేదీన రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎల్.ఎన్.పేట మండలం కోయిలాం గ్రామానికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పీహెచ్ రోడ్డులో కల్లెమ్మ, తదితర చోట్ల ఉన్న పలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారుల స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పారాపురం వద్ద అలికాం-బత్తిలి రోడ్డు మలుపు వద్ద బైక్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి (ఫైల్)

పట్టించుకోవడం లేదు..



అలికాం-బత్తిలి రోడ్డులో నిత్యం వాహనాలతో రద్దీగా ఉన్న పారాపురం సమీపంలోని మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలను నివారించే హెచ్చరిక బోర్డులను ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేయకపోవడం దారుణం. – వనుము లక్ష్మీనారాయణ, పారాపురం, కొత్తూరు మండలం

చర్యలు తీసుకుంటాం...

రహదారుల్లోని మలుపుల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. బోర్డుల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తాం.
– గోపాలరావు, జేఈ, ఆర్అండ్‌బీ, కొత్తూరు



అలికాం-బత్తిలి రోడ్డులో పారాపురం వద్ద ఉన్న మలుపు



మాతల-రుగడ రోడ్డులో మాతల జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు